నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
మంగళవారం | ఏప్రిల్ 08, 2025 | www.navatelangana.com

ఘనంగా ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖానా వార్షికోత్సవం

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రాలో గల ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖాన 20వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ వీటీ మహేష్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 20 వసంతాలు పూర్తి చేసుకోవడం గొప్ప విషయమన్నారు. నాటి నుండి నేటి వరకు 77,293 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశామన్నారు. అందులో 10,639 మందిని సెకండరీ సెంటర్ అయిన శేషన్న చెన్నావార్ ఆస్పత్రికి రెఫర్ చేశామని పేర్కొన్నారు. అర్హులైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వీసీసీ వెంకటరమణయ్య, ఆర్ఎంపీ వైద్యులు కిషోర్, జ్ఞానేశ్వర్, ప్రభాకర్ పాల్గొన్నారు.



12 నుండి తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఏప్రిల్ 12 నుండి 14 వరకు జరిగే తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఏప్రిల్ 12 నుండి 14 వరకు ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం భీం యుద్ధ భూమి జోడేఘాట్‌లో మహాసభలు నిర్వహిస్తామన్నారు. దీనికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, డివిజన్, మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరవుతారని తెలిపారు. ఆదివాసుల అస్తిత్వంపై కొనసాగుతున్న దమనకాండకు వ్యతిరేకంగా పోరాటాలు చేసేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను చట్ట సభల్లో ఏకరువు పెట్టాల్సిన ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. కుట్రలను తిప్పికొట్టేందుకు ఆదివాసులు సంసిద్ధం కావాలని కోరారు.

ఓటరు నమోదుకు మరో ఛాన్స్..!

- ఏప్రిల్ 1నాటికి 18ఏండ్లు నిండితే చాలు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- స్థానిక సంస్థలకు పెరగనున్న ఓటర్లు

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియగా మారింది. ఇందుకోసం ఏడాదిలో నాలుగు సార్లు ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తుంది. గత మంగళవారం నుంచి ఓటరు నమోదు చేపట్టారు. దీనికి ఆసిఫాబాద్ జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గతంలో ఓటర్ నమోదు ఏడాదికి ఒకసారి మాత్రమే అవకాశం ఉండేది. తాజాగా కొత్త ఓటర్ల నమోదు జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో నమోదుకు అవకాశం కల్పించింది. తాజాగా ఏప్రిల్ నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ బీఎల్‌ఓల వద్ద లభించే దరఖాస్తుల ద్వారా లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

నవతెలంగాణ-కెరమెరి

జిల్లాలో ఓటర్ నమోదుకు సంబంధించి ఓటరు జాబితా సవరణపై కలెక్టర్ రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, ఓటర్ల బదిలీ, గుర్తింపు కార్డులో మార్పులు, కుటుంబ సభ్యులందరూ వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదు ఉంటే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా జాబితాను సవరించనున్నారు.

స్థానిక ఎన్నికల్లో పెరగనున్న ఓటర్లు

ఓటర్ నమోదు ప్రక్రియతో త్వరలో రాబోయే స్థానిక ఎన్నికల్లోను ఓటర్ల సంఖ్య పెరగనుంది. బోగస్ ఓటర్లు కూడా తొలగిపోనున్నారు. మున్సిపల్, పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపిటీసి ఎన్నికల సమయంలో ఓటర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ అవుతుందని భావిస్తున్నారు. ఇదే సమయంలో ప్రస్తుత ఓటర్ల నమోదులో గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక ఎన్నికల ఓటరు జాబితా పెరుగుతుందని భావిస్తున్నారు.


జిల్లాలో ఇది ఓటర్ల లెక్క

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 4,53,538 మంది ఓటర్లు ఉన్నారు. గతేడాది ఫిబ్రవరి 8న ప్రకటించిన ఎన్నికల జాబితాలో 189 మంది ఓటర్లు పెరిగారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం మరోసారి ఓటరు నమోదుకు అవకాశం ఇవ్వడంతో జిల్లా వ్యాప్తంగా ఓటర్లు పెరగనున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2,26,582 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 112510, మహిళలు114056 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 16 మంది ఉన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో మొత్తం 2,28,855 మంది ఓటర్లకు 114484 మంది పురుషులు,114359 మంది మహిళలు, 12మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

ఈ-రిజిస్ట్రేషన్ చేయడం ఇలా..

ఎన్నికల కమిషన్ సూచించిన అన్ని ఫారాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఈ-రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంచారు. అర్హత కలిగిన యువత ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ పేరుతో ఉన్న వెబ్‌సైట్ వస్తుంది. దీంట్లో పైన ఈ-రిజిస్ట్రేషన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే కొత్తగా చేరే వారి కోసం చేర్పులు మార్పులు అభ్యంతరాలకు సంబంధించిన ఫారాలు కనిపిస్తాయి. కొత్తగా చేరే వారు ఫాం-6 పైన క్లిక్ చేస్తే ఫార్మ్ వస్తుంది. అందులో తమ వివరాలు నమోదు చేయాలి. తర్వాత తెలుగులో ట్రాన్స్‌లేట్‌కు ఆప్షన్ ఉంటుంది. ఫారం పూర్తి చేసిన తర్వాత ఫొటోను అప్‌లోడ్ చేయాలి. 100 కేబుల్ మించకుండా ఉండాలి. ఫారం-6 నింపడం పూర్తయిన తర్వాత సేవ్ చేసి ట్రాన్స్‌ఫర్ బటన్ క్లిక్ చేయాలి. ఆ తర్వాత యూనిక్యూ అప్లికేషన్ ఐడి నెంబర్ వస్తుంది. దాని ద్వారా అప్‌లోడ్ చేసిన దరఖాస్తు స్టేటస్‌ను చూసుకోవచ్చు. ఓటరుగా ఈ-రిజిస్ట్రేషన్ చేసిన దరఖాస్తును తహసీల్దార్ డౌన్లోడ్ చేసుకుని అందజేసిన వివరాలపై విచారణ జరుపుతారు.





అధికారుల వివరాల సేకరణ ఇలా..

ఈ-రిజిస్ట్రేషన్ లేదా స్వయంగా దరఖాస్తులను అందించిన వాటిని అధికారులు వివరాలు సేకరిస్తారు. దరఖాస్తుదారుల నుంచి వచ్చిన వివరాలను స్వయంగా బీఎల్‌ఓల ద్వారా సేకరిస్తారు. సేకరించిన వివరాలను ఫారం-9 ద్వారా చేర్పులు ఫారం-10 ద్వారా అభ్యంతరాలు ఫారం-11 ద్వారా సవరణలు ఫారం-11 ద్వారా బదిలీలు తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తారు. ఫారం-6 ద్వారా వచ్చిన దరఖాస్తులను వారి అర్హతను పరిశీలించి, రెండు కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను స్వీకరిస్తారు. పూర్తయిన దరఖాస్తులు మళ్లీ ఆర్డీఓ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడ పూర్తిస్థాయిలో ఎన్‌రోల్ చేస్తారు.

వ్యాధులపై అవగాహన కల్గి ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వ్యాధులపై సరైన అవగాహన లేక వివిధ రోగాలకు గురవుతున్నారని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. సోమవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు పారిశుధ్య కార్మికులకు అందిస్తున్న చికిత్సలను పరిశీలించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. ఏదైనా అనారోగ్య సమస్య వస్తే అతనితో పాటు కుటుంబం కూడా ఇబ్బంది పడుతుందన్నారు. ఆరోగ్య సమస్యలు రాకుండా వ్యాధులపై అవగాహన పెంచుకుంటూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి పూర్తిగా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికెళ్లి పరీక్షించుకోని మందులను వాడాలన్నారు. తాము కూడా జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్యం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇక్కడి వైద్యం కోసం వస్తారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్, వైద్యులు సమీయోద్దీన్, సానిటరి ఇన్‌స్పెక్టర్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకే జై సంవిధాన్ నినాదం



నవతెలంగాణ-సారంగాపూర్

దేశ ప్రజలకు వాస్తవాలను చెప్పేందుకే కాంగ్రెస్ పార్టీ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టినట్లు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. బోరిగాం గ్రామంలో సోమవారం జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, బాపూజీ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని కాంగ్రెస్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్ లాంటి గొప్ప ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అణగదొక్కాలని చూస్తోందని మండిపడ్డారు. కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. మహాత్మ గాంధీ, అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య ,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, దశరథ్ రాజేశ్వర్, వెంకటరమణరెడ్డి, కోర్వా నవీన్, ముత్యంరెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, ముక్తార్, సర్పంచులు నారాయణ్‌రెడ్డి, మధుకర్, రవీందర్, భూమారెడ్డి, ఓ.నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, లింగారెడ్డి, కృష్ణ, కైలాష్, మాజీ ఎంపీటీసీ రాజు పాల్గొన్నారు.

12న ఆదిలాబాద్ పాలిటెక్నిక్‌లో గెట్ టూ గెదర్

- 1980 నుండి 40కిపైగా బ్యాచ్‌లు పూర్తి
- 44 ఏండ్ల తర్వాత కలిసే అవకాశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో చరిత్రలో మొదటిసారిగా 1980 నుండి అన్ని బ్యాచులకు సంబంధించి పూర్వ సమ్మేళనాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నారు. సమ్మేళనానికి సంబంధించి సన్నాహక సమావేశాన్ని శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ బండి రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. అందుబాటులో ఉన్న అల్యూమ్ని మెంబర్స్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 12న జరిగే కార్యక్రమంపై చర్చించారు. పూర్వ విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తూ పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈవెంట్‌కు సంబంధించి పలువురికి పలు బాధ్యతలు ఇస్తూ పలు కమిటీలను వేశారు. అనంతరం అడహాక్ కమిటీని పూర్వ విద్యార్థుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా అభయ్ రాజ్, కార్యదర్శిగా ఉమాశంకర్, కోశాధికారిగా విజయ్ బాబు, కమిటీ సభ్యులుగా ఫాతిమా, నీల్‌కమల్, జి.శ్రీకాంత్, ఆర్.సందీప్, ఆర్.ప్రణయ్, టి.అజయ్, ఎన్. రుత్విక్‌ను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రకటించారు. కమిటీ ఆధ్వర్యంలోనే ఈ నెల 12న పూర్వ విద్యార్థుల మొదటి అల్యూమ్ని సమావేశం జరగనున్నట్లు ప్రిన్సిపాల్ బండి రాంబాబు పేర్కొన్నారు. 1980 నుండి 2024 వరకు దాదాపు 40కి పైగా బ్యాచులు పూర్తయ్యాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వారికి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా సందేశాన్ని పంపుతూ సమ్మేళనానికి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కలిసి చదువుకున్న రోజులను నెమరవేసుకోవడానికి, తోటి స్నేహితులను, అధ్యాపకులను కలవడానికి ఇదొక మంచి వేదిక అని కొనియాడారు. పూర్వ విద్యార్థులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

సీసీఐ ప్రారంభానికి ఉద్యమ కార్యాచరణ

- సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ ఫ్యాక్టరీని పున:ప్రారంభించడంలో ప్రజల భాస్వామ్యం కోసం ఉద్యమ కార్యాచరణను రూపొందించామని సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ తెలిపారు. సోమవారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 8 నుంచి 10 వరకు గ్రామగ్రామాన కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు. 9న ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో సీఎంను కలిసి సమస్యను విన్నవిస్తామన్నారు. ఈ నెల 11,12,13 తేదీల్లో గ్రామ, మండలాల కమిటీల నిర్మాణం, గ్రామ, మండల కేంద్రాలలో సమావేశాలు, ప్రెస్‌మీట్‌లు నిర్వహించడం, 16న రిటైర్డ్ ఉద్యోగులు, మేధావులు కుల సంఘాలతో చర్చాగోష్ఠి నిర్వహిస్తామని తెలిపారు. 22న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలతో చర్చా వేదిక ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం విద్యార్థి, యువజన, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. సీసీఐతో పాటు ఎయిర్‌పోర్టు పనులు, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్, టెక్స్‌టైల్ పార్కు సాధన కోసం ఉద్యమిస్తు ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. ఇటీవల సాధన కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిని కలిసి హామీ తీసుకున్నామన్నారు. కేంద్రం నుంచి జిల్లాలో పెండింగ్ లో ఉన్న పనులను సాధించేలా ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. ప్రజలు కూడా కమిటీకి పూర్తి మద్దతు తెలియజేస్తూ సహకారం అందించాలని కోరారు. సమావేశంలో కో కన్వీనర్లు విజ్జగిరి నారాయణ, లోకారి పోశెట్టి, కొండా రమేష్, సిర్ర దేవేందర్, వెంకట్ నారాయణ, భామన్ జగన్‌సింగ్, ఈశ్వర్‌దాస్, బండి దత్తాత్రి, సభ్యులు చిల్కా దేవిదాస్, దర్శనాల నగేష్, దాసరి రమేష్, బొజ్జ ఆశన్న, గోవర్ధన్ యాదవ్, విఠల్ పాల్గొన్నారు.

పదేండ్ల పోరాట ఫలితమే ఎయిర్‌పోర్ట్ నిర్మాణం



ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌తో పాటు విమానాశ్రయం ఏర్పాటు కోసం పదేండ్లుగా చేసిన పోరాటంతో సాధ్యపడిందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి సహకరించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. త్వరలోనే భూసేకరణ, మౌలిక వస్తువుల ఏర్పాటు జరుగుతుందన్నారు. పీఎం నరేంద్ర మోడీ ప్రత్యేకంగా జిల్లాపై దృష్టి సారించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే జిల్లాకు రావాల్సిన కేంద్ర ప్రాజెక్టులు రాలేదని పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే గెలిస్తే ఏమవుతుందని అన్న నాయకులకు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, ఎయిర్‌షిఫ్ట్ సమాధానం అని తెలిపారు. సమావేశంలో బిజెపి నాయకులు రాజు, లాలా మున్నా, మయూర్ చంద్ర, నగేష్, జోగు రవి, వేదవ్యాస్, దినేష్ మాటోలియా, కృష్ణ యాదవ్, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సుభాష్, రాకేష్, భూమేష్ పాల్గొన్నారు.

వ్యాపారంలో అభివృద్ధి సాధించాలి : డీసీసీ అధ్యక్షులు



నిర్మల్‌టౌన్: వ్యాపారంలో దినదిన అభివృద్ధి సాధించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పింజరిగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన లడ్డూ కాజ స్వీట్ హోమ్ దుకాణాన్ని సోమవారం ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్ బిన్ హమ్దాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దుకాణ యజమానికి హఫీజ్, సోహైల్, నవీద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సోమ భీమ్‌రెడ్డి, ప్రభుత్వ ప్లీడర్ శుభకరన్, అబ్దుల్ హాది, మొహమ్మద్ జాహెద్ అలీ, మొహమ్మద్ జిషాన్ అలీ, సభ కలీం, అతీక్ అహ్మద్, మజార్ అలీ ఖాన్, వజీద్ అహ్మద్‌ఖాన్, అర్షద్, నవీద్, అడపా శ్రీకాంత్, గాజుల రవికుమార్, నిమ్మ సాయన్న పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడి అరెస్ట్



నవతెలంగాణ-తాండూర్

గత నెల 29న బెల్లంపల్లి కాల్‌టెక్స్ ప్రాంతంలో జరిగిన దొంగతనంతో ప్రమేయమున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడైన గజానంద్ పార్థీ(45)ని పోలీసులు పట్టుకున్నారు. వివరాలను బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ సోమవారం బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో వెల్లడించారు. బెల్లంపల్లి పట్టణంలోని కాల్‌టెక్స్ ప్రాంతంలో సాన శ్రావణ్ ఇంట్లో తలుపులు పగులగొట్టి ఇంట్లో ఉన్న 14.5 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.20వేల నగదు చోరీ చేశారు. పక్కనే ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు అట్టే సుధాకర్ ఇంట్లో 5 తులాల బంగారం చోరీకి గురైంది. శ్రావణ్‌కు చెందిన బైకుతోపాటు అదే కాలనీలో నిలిపి ఉంచిన మరో 3 బైకులను ఎత్తుకెళ్లారు. మూడు ప్రత్యేక పోలీసు బృందాలు దర్యాప్తు చేశాయి. బల్లార్ష చంద్రపూర్, మహారాష్ట్ర ప్రాంతాలలో గాలించగా నిందితులకు సంబంధించిన ఆధారాలు లభించాయి. దర్యాప్తులో భాగంగా బెల్లంపల్లిలో గాలింపు చర్యలు జరుపుతుండగా రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న దొంగల ముఠా సభ్యుడు తారసపడ్డాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గుణా జిల్లా కనేర గ్రామానికి చెందిన గజానంద్ అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడు. 12 మంది అంతర్రాష్ట్ర దొంగలు బెల్లంపల్లిలో రెక్కీ నిర్వహించి దొంగతనం చేశారు. దాచిన బైకులను తీసుకెళ్లేందుకు బెల్లంపల్లికి వచ్చి పోలీసులకు పట్టుబడ్డాడు. తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, జమ్మూకాశ్మీర్ ప్రాంతాలలో ఈ ముఠా సభ్యులు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఏసీపీ వెల్లడించారు. తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులకు కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో ముమ్మరంగా గాలిస్తున్నట్లు చెప్పారు. పట్టుబడ్డ గజానంద్ పార్థీ వద్ద నుండి 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అంతర్రాష్ట్ర ముఠా సభ్యున్ని చాకచక్యంగా పట్టుకున్న బెల్లంపల్లి రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలొద్దిన్, ఎస్సైలు చుంచు రమేష్, కె.మహేందర్, ప్రసాద్‌ను ఏసీపీ అభినందించారు.

వరి ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కొరకు రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, డీఆర్డీఓ కిషన్, డీఏఓ కల్పన, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి యాసంగి 2024-25 వరిధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేస్తాన్నారు. గ్రేడ్ ఎ రకానికి రూ.2వేల320, సాధారణ రకానికి రూ.2వేల300 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో కనీసం 25టార్పాలిన్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ధాన్యం తూకం చేయడానికి ముందే సంబంధిత రైతు వద్ద నుండి కూపన్, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు తీసుకోవాలన్నారు. పంట కోత సమయంలో హార్వెస్టర్ నియంత్రణ, వ్యవసాయ విస్తరణ అధికారులు చేపట్టడంతో పాటు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఐకెపి ఆధ్వర్యంలో 104 దొడ్డురకం, 90 సన్నరకం కొనుగోలు కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 80 దొడ్డురకం, 39 సన్నరకం, మెప్మా ఆధ్వర్యంలో 4 దొడ్డురకం, 2సన్నరకం కొనుగోలు కేంద్రాలతో మొత్తం 319 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం సహకారంతోనే పేదలకు సన్న బియ్యం



సారంగాపూర్ : ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా రాష్ట్రంలోని పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని పీఎం నరేంద్రమోదీ ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం గడిచిన 5 సంవత్సరాలుగా కరోనా సమయం నుండి దేశ వ్యాప్తంగా ఉచిత బియ్యం పంపిణీకి సహకరిస్తుందని తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నుండి మార్కండేయ స్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, జిల్లా, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితుడికి రూ.5లక్షల చెక్కు అందజేత

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన గిరిజనుడు మెస్రం లచ్చు గతంలో ఎలుగు బంటి దాడిలో గాయపడగా సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజార్షిషా చేతుల మీదుగా బాధితుడు మెస్రం లచ్చుకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్యామలదేవి, తహసీల్దార్ రాజమోహన్ ఉన్నారు.



సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-సిరికొండ

సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ సీఐ భీమేష్ అన్నారు. సోమవారం మండలంలోని ధర్మసాగర్ గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మత్తు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించి, వాహనాలను నడపాలని అన్నారు. యువత ముఖ్యంగా డ్రగ్స్‌కు అలవాటు పడి చెడిపోతున్నారని, మంచి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివరాం, గ్రామస్తులు బిక్కు పాల్గొన్నారు.



అర్జీలపై అలసత్వం వహించొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలు ఇచ్చే అర్జీలపై ఎలాంటి అలసత్వం వహించొద్దని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు అందించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జొన్న కొనుగోళ్ల చేయాలని, అఖిల పక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో బండి దత్తాత్రి వినతిపత్రం అందించారు. అదే విధంగా పట్టణంలో మైనర్‌పై జరిగిన లైంగికదాడి ఘటనలో బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించినందుకు కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలిసి శాలువాతో సత్కరించి ధన్యవాదలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ భూసమస్యలతో పాటు ఉద్యోగాలకు సంబంధించి, ప్రజావాణిలో ఫిర్యాదులు ఇవ్వొద్దని సూచించారు. అధికారులు కూడా ప్రజలు ఇచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. వేసవిలో ఏ గ్రామంలో కూడా నీటి సమస్య రాకుండా ముందస్తుగా అన్నీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



నవతెలంగాణ-నిర్మల్

మామడ మండలంలోని నల్దుర్తి గ్రామనికి చెందిన కాంగ్రెస్ నాయకులు పడాల భీమేష్ ఇటీవల అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులు డాక్టర్ రమేష్‌రెడ్డితో మాట్లాడారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భీమేష్ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ అబ్దుల్ హాది, గాజుల రవి కుమార్ ఉన్నారు.

రాంజీ గోండు వర్థంతి సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నేరడిగొండ

రాంజీ గోండు వర్థంతి సభను జయప్రదం చేయాలని ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్‌రావు మొకాశి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 9న ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో జరిపే మర్సుకోల రాంజీ గోండు 166వ వర్థంతి సభకు ఆదివాసులు అధిక సంఖ్యలో పాల్గొని, సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన జిల్లా ఉపాధ్యక్షులు మండాడి లక్ష్మణ్, ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా నాయకులు గోడం జ్యోతిరామ్, నేరడిగొండ మండల కార్యదర్శి సోయం విజయ్ కుమార్, మండల నాయకులు పెందోర్ ధర్ము, సోయం శ్రీనివాస్, అర్క గంగారాం, ఆత్రం గంగారాం, గేడం భూమన్న, అర్క మదన్ పాల్గొన్నారు.

పాఠశాలను అభివృద్ధి చేసుకుంటున్నాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంస్కరం, దేశభక్తి పరంపరను కొనసాగిస్తునే కాలానికి అనుగుణంగా పాఠశాలను వృద్ధి చేసుకుంటున్నామని, శ్రీసరస్వతి విద్యాపీఠం ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ కోసం నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. దీనికి ఆయనతో పాటు ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ భూమిపూజ చేశారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్‌లో సీబీఎస్ఈ నామ్స్ ప్రకారం భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో రెండవ పాఠశాలగా ఆదిలాబాద్ ను ఎంపిక చేయడం జరిగిందని, మొదటిది నిర్మల్ అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు లోలం ఓంప్రకాష్, విభాగ్ కార్యదర్శి కట్టనాగచారి, జిల్లాకార్యదర్శి రాజేష్, రావుత్ రవీందర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాత, శిశు సంరక్షణ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ, పోస్ట్ ఆపరేషన్, ఇంజక్షన్ వార్డులను పరిశీలించి రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వైద్య చికిత్సలు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను సంఖ్యను పెంచాలని, ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగేలా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి, నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అవుట్ పోస్ట్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై రోగులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఆస్పత్రి వైద్యులు డా. సరోజ, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు శాశ్వత మార్గం చూపాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీధి వ్యాపారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని శివాజీచౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీ చౌక్‌లో వ్యాపారం చేస్తున్న వారికి తత్కాలికంగా గణేష్ థియేటర్ స్థలంలో వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నారని, కానీ వీరికి శాశ్వత మార్గం చూపాలని, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ అన్నారు. సోమవారం వీధి వ్యాపారులతో కలిసి ఆయా పార్టీల నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. 30 సంవత్సరాలుగా వ్యాపారం చేసుకుటున్నారని, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలిగించడం లేదని, న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఏండ్లుగా ఆయా కూడల్లలో వ్యాపారం చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకున్న వారిని అధికారులు ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. మార్కెట్ ఎరియాలో వ్యాపారం కొనసాగుతుందని, గణేష్ థియేటర్ ప్రాంతంలో వ్యాపారం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. గతంలో కూడా గణేష్ థియేటర్ వద్ద స్థలం ఇచ్చిన అధికారులు తరువాత వారిని అక్కడి నుంచి పంపించి, ఇతరులకు లీజుకు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారులు మారుతుంటారని, వారి నిర్ణయాలు వీధి వ్యాపారం చేసుకునే వారికి న్యాయం జరిగేలా ఉండాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఐఎం పట్టణాధ్యక్షుడు నజీర్ అహ్మద్, ఆయా పార్టీ నాయకులు పత్తిముజ్జు, సిరాజ్ ఖద్రి, షౌకత్ అలీ, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న బీసీ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల రాజ్య స్థాపనకై డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టే 1లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్ర విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మాభూమి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14 ఆదిలాబాద్ డైట్ మైదానంలో బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రకులాల పేదలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణలో 90 శాతం గల ఎస్సీ, బీసీ, ఎస్టీ, పీడిత ప్రజల రాజ్యాధికారం కోసం ప్రజలను చైతన్య పరుస్తూ, తమ సొంత కాళ్లపై తమ రాజ్యం సాధించుకోవడానికే మా భూమి రథయాత్రను డీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. జనాభా ప్రతిపాదికన న్యాయం చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న ఈ పార్టీలను ప్రజల ముందు ఎండగట్టేందుకే ఈ రథయాత్ర అని అన్నారు. మహనీయులు కలలు కన్న రాజ్యం సాధించుకొనుటకు అన్ని సబ్బండా వర్గాల ప్రజలు భాగస్వామ్యమై కలిసి మా భూమి రథయాత్ర విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, బీసీ సంఘం నాయకులు సుకుమార్ పెట్కులే, రవి, సాంబన్న, శ్రీనివాస్, ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్, తలమడుగు అధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి గంగన్న, రాంచందర్, శ్రీనివాస్, విను కుమార్, గోవర్ధన్, శ్రీధర్, సాయి పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ భరోసా ఏదీ..?

- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న



విలేకరులతో మాట్లాడుతున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతుల రుణమాఫీ పూర్తిగా చేస్తామని ఇచ్చిన భరోసా ఏమైందని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ప్రశ్నించారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.6 వేల రైతుబంధు మాట ఏమైందన్నారు. కేవలం రబీ సీజన్ సాయం అదికూడ అందరి రైతులకు ఇంకను అందలేదన్నారు. 2024, ఖరీఫ్ పంట సాగు సాయం ఎందుకు ఇవ్వలేదని సవాల్ చేశారు. జిల్లాలో మొత్తం 1.63 లక్షల మంది రైతులుండగా, నాలుగు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులు 1,00371 ఉన్నారన్నారు. ఇంకను 27వేల మంది రైతులకు రుణమాఫీ వారి ఖాతాలో జమాకాలేదని పేర్కొన్నారు. 2025 ఆర్థిక సంవత్సరం ముగిసిన రైతులకు మాత్రం పూర్తి స్థాయిలో రుణమాఫీపై స్పష్టత ఇవ్వలేదని సవాల్ చేశారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణమాఫీతో పాటు ఖరీఫ్ పెట్టుబడి సాయంపై స్పష్టత లేక పోవడంతో రైతన్న ఆర్థికంగా కుమిలి పోతున్నాడని పేర్కొన్నారు. వెంటనే దీనిపై స్పష్టత నివ్వాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రైతులు సుదర్శన్, తెలంగ్‌రావ్, లక్ష్మణ్, సుమిత్ర, సోను బాయి పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని కుమ్మరితండ గ్రామపంచాయతీ పరిధిలోని రాముగూడ గ్రామానికి చెందిన కుమ్ర సోనేరావు తండ్రి పేరు భీమ్‌రావు అతని ఇంటి ఆవరణంలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడు. సోమవారం సమాచారం మేరకు ఎస్సై మనోహర్ గ్రామానికి వెళ్లి తనిఖీ చేయగా, అక్కడ కుమ్ర సోనేరావు ఇంటి ఆవరణంలో 20 గంజాయి మొక్కలు సుమారు 3 ఫీట్ల నుంచి 7 ఫీట్ల ఎత్తుగా ఉండగా వాటిని స్వాధీనం చేసుకొని అతని పైన కేసు నమోదు చేసి, అతని భూమి వివరాలు తెలుసుకొని, అతనికి వచ్చే ప్రభుత్వ పథకాలు రైతు బంధు, రుణమాఫీ, ఉచిత విద్యుత్తు లాంటివి లాభాలు పొందకుండా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తామన్నారు. గ్రామంలో ఎవరైనా గంజాయి మొక్కలు సాగు చేస్తే వారిపై కేసు నమోదుతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు పొందకుండా చేస్తామన్నారు.



గంజాయి మొక్కలను పీకేస్తున్న పోలీసులు

సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు అందజేసి పరిష్కరించాలన్నారు. ఉట్నూర్ మండలం చాందూరి గ్రామానికి చెందిన పోసుబాయి తనకు అంగన్‌వాడీ కేంద్రంలో ఉద్యోగం కల్పించాలన్నారు. తాండూర్ మండలం గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన గట్ల నర్సయ్య తనకు మేకల లోన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని కోరారు. నేరడిగొండ మండలం కుంటాల గ్రామానికి చెందిన సిడం లక్ష్మి తనకు ఆశ్రమ పాఠశాలలో ఆశ వర్కర్ ఉద్యోగం కల్పించామని కోరారు. పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏఓ దామోదర స్వామి, మనోహర్, ఈఈ తానాజీ, పీహెచ్ఓ సందీప్ కుమార్, మేనేజర్ శ్యామల, డీపీఓ ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యవసాయ కూలీ మృతి

నవతెలంగాణ-తలమడుగు

అనుమానాస్పదంగా వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని ఉండం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉండం గ్రామానికి చెందిన తంగడపల్లి గజానన్(28) వ్యవసాయ కూలీ ఆదివారం యాజమాని దార్ల కిష్టన్న డెయిరీఫామ్‌లోని చేనులో అనుమానస్పదంగా గడ్డి చేనులో మృతి చెందాడు. మృతుడి భార్య ప్రవళిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతుడు గత సంవత్సరం నుంచి కిష్టన్న డెయిరీఫామ్‌లో కూలి పని చేస్తుండగా, ఆదివారం ఎప్పటిలాగా ఉదయం ఏడు గంటలకు మద్యం మత్తులో అన్నం తినకుండా బర్రెలకు గడ్డి కోయడానికి వెళ్లాడు అదే డెయిరీలో బీహార్ రాష్ట్రానికి చెందిన కుందన్ కుమార్ ఆదివారం సాయంత్రం కుక్కలు అరవడంతో అడవి పందులు ఏమైనా వచ్చాయని వెళ్లిచూడగా అప్పటికే గజానన్ మృతి చెంది ఉన్నాడు. వెంటనే యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. మృతుడు మద్యం మత్తు, భోజనం చేయకపోవడం వడదెబ్బ లేదా గడ్డిలో పనిచేయగా ఏదైనా విష పురుగు కరిచిందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకం



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

పేదలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం చారిత్రాత్మకమని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమ భీమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీలాయిపేట గ్రామంలో సోమవారం సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధనవంతులు తినే సన్నబియ్యం ఇకపై పేదలు కూడా తినే రోజులు వచ్చాయని అన్నారు. ఈ పథకం ద్వారా అర్హత గల కుటుంబాలకు నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ పథకాన్ని పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు కుంట వేణు గోపాల్, మాజీ ఎంపీపీ కొరిపల్లి రామేశ్వర్‌రెడ్డి, కుంట పద్మాకర్, గాంధ్ల విలాస్, మాజీ సర్పంచ్ సాయన్న ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే సన్న బియ్యం

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

కేంద్ర ప్రభుత్వం సాహకారంతోనే పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలం చిట్యాల్‌లో సన్న బియ్యాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా రాష్ట్రంలోని పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని, నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గడిచిన 5 సంవత్సరాలుగా కరోనా సమయం నుంచి దేశ వ్యాప్తంగా ఉచిత బియ్యం పంపిణీకి సహకరిస్తుందని అన్నారు. అనంతరం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్, ముత్యం రెడ్డి, వీరేష్, జమాల్, మండలాధ్యక్షులు వెంకట్‌రెడ్డి, నర్సారెడ్డి, నరేష్, నాయకులు మౌలానా, చంద్ర ప్రకాష్‌గౌడ్, విలాస్, రాజా రెడ్డి, రాజేశ్వర్, వీరయ్య, సాగర్‌రెడ్డి, గంగారెడ్డి, లింగారెడ్డి, తిరుమల చారి, శేఖర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | ఏప్రిల్ 08, 2025 | www.navatelangana.com

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకంతో ఆహార భద్రత

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సన్నబియ్యం పథకంతో ఆహార భద్రత చేకూరుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం వారు కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామ పంచాయతీ పరిధిలోని ఊట్‌పెల్లిలో సన్న బియ్యం లబ్దిదారుడు మర్సకోల లింగు నివాసంలో భోజనం చేశారు. దీనికి అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని చేపడుతోందని, దీనిని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ తహసీల్దార్ కిరణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి చెందిన అంబులెన్స్‌లో శిశువు జన్మించిన సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని గుండి గ్రామంలో శేఖర్ భార్య డి.విజేత పురిటి నొప్పులతో బాధపడుతుందని సమాచారం రావడంతో 108 సిబ్బంది గ్రామానికి చేరుకొని ఆమెను ఆసిఫాబాద్ తరలిస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో 108 సిబ్బంది ఆమెకు డెలివరీ చేశారు. పండంటి మగ బిడ్డకు జన్మనివ్వడంతో పాటు తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారు. దీంతో ఈఎంటీ వెంకటేష్, పైలట్ మల్లేష్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. 108 సిబ్బంది స్పందించడం తల్లి బిడ్డ క్షేమంగా ఉండడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు మెండు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత పాలిసెట్ కోచింగ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పాలిటెక్నిక్ విద్యను అభ్యసించవచ్చని, ఇది భవిష్యత్తులో ఇంజనీరింగ్ విద్యకు ఉపయోగపడుతుందని అన్నారు. ఉద్యోగావకాశాల పరంగా పాలిటెక్నిక్ విద్య ఎంతో ఉపయోగకరమని అన్నారు. పాలిటెక్నిక్ కళాశాల వర్క్‌షాప్ సూపరింటెండెంట్ రామదాసు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్హతతో సాఫ్ట్‌వేర్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, రైల్వే, ఎయిర్‌లైన్స్, ట్రాన్స్‌పోర్ట్, గనుల శాఖలలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నట్లు తెలిపారు. కోచింగ్ సెంటర్ కో కన్వీనర్, మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ఉచిత కోచింగ్ ద్వారా గ్రామీణ విద్యార్థులకు గొప్ప అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కో ఆర్డినేటర్ కటకం మధూకర్, సిర్పూరు ఎంఈఓ వేణుగోపాల్, డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీనరసింహంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని గుంట్లపేట గ్రామానికి చెందిన మొగిలి భీమయ్య, డోకె లావణ్యం, నెల్లూరు గ్రామానికి చెందిన అప్పాజీ హరీష్, కుకుడ వెంకన్న గోలేటి బాబుకు సీఎం సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను అందించారు. ఎమ్మెల్యే హరీష్ బాబు ఆదేశాల మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు కుకుడ రాజేష్ ఆధ్వర్యంలో లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు చప్పిడె సత్యనారాయణ, బండి ప్రభాకర్, జునుగరి మధూకర్, డోకే బాపూజీ, చపిడె రవి, పాగిడి ఆనంద్ రావు పాల్గొన్నారు.

నవజాత శిశువుల మరణాలను అరికట్టాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

నవజాత శిశువుల మరణాలను అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని కిమ్స్ హాస్పిటల్‌లో కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ఆశా వర్కర్లకు మాత, నవజాత శిశువుల మరణాలను అరికట్టడంపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కొత్తపల్లి అనిత, కొత్తపల్లి పరమేశ్వర చారి, డా.రామ్ మూర్తి, డా. లక్ష్మి ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు ఎకరానికి రూ.25 లక్షలు ఇవ్వాలి

నవతెలంగాణ-రెబ్బెన

గోలేటి సింగరేణి ఓపెన్ కాస్ట్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.25 లక్షలతో పాటు కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని గోలేటి, సోనాపూర్ శివారులో సింగరేణి ఓపెన్ కాస్ట్‌లో ముంపునకు గురవుతున్న భూములకు సింగరేణి యాజమాన్యం ఎకరానికి రూ.25 లక్షల నష్టపరిహారంతో పాటు సింగరేణి ఉద్యోగం ఇవ్వాలాన్నారు. సింగరేణి యాజమాన్యం ఓపెన్ కాస్ట్ పేరుతో భూమి తీసుకుంటున్న రైతులకు ఎకరాకు కేవలం రూ.7 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని చూస్తుందని, ఇది చాలా తక్కువ ధర అని అన్నారు. బయటి మార్కెట్‌లో ఎకరాకు రూ.20 లక్షలకు తక్కువ లేదన్నారు. రైతుల నుండి తక్కువ రేటుకు భూమిని కాజేయడానికి సింగరేణి ప్రయత్నిస్తుందని మార్కెట్ విలువతో పాటు ఎకరానికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇచ్చి కుటుంబంలో ఒకరికి సింగరేణి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులకు న్యాయం జరిగే వరకూ రైతుల పక్షాన న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నవీన్ గౌడ్, సిడం ధర్ము పటేల్, సిడం జైతూ, నారా నాగమ్మ పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



శానిటరీ న్యాప్కిన్స్ అందిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

బాలికలు సకాలంలో పోషక ఆహారం తీసుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల ఉన్నత పాఠశాలలో మహిళ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పింకీస్ ఫౌండేషన్ సహకారంతో నవి సమ్మన్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన బాలికలకు సానిటరీ నాప్కిన్స్ పంపిణీ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, పింకీస్ ఫౌండేషన్ మేనేజర్ భార్గవి బట్నగర్, కార్యదర్శి పండిట్ శాలిని గుప్తా, అధ్యక్షులు అరుణ్ గుప్తాలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సకాలంలో పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువు, క్రీడారంగం, ఎంచుకున్న రంగాలల్లో రాణించవచ్చని తెలిపారు. పింకీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 35 పాఠశాలలను సానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థినులు ఆరోగ్యం, పరిశుభ్రత, పారిశుధ్య సూత్రాలను పాటించాలని, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిషనర్ ఉదయ్ బాబు, జిల్లా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

మినీ రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయాలి



ఏఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు, రైతులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బురదగూడ, వంజరి గ్రామాలకు సంబంధించిన మినీ రిజర్వాయర్ గత సంవత్సరం భారీ వర్షాలకు కట్టతెగి పోవడం, ఒక తూము కూడా పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ అన్నారు. వెంటనే మినీ రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయాలని కోరుతూ ఇరిగేషన్ ఏఈకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బురదగూడ, వంజరి గ్రామాలకు సంబంధించి మినీ రిజర్వాయర్ కట్ట తెగిపోవడంతో ఈ రెండు గ్రామాలకు సంబంధించిన సుమారు నాలుగు వందల ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. దీని కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మినీ రిజర్వాయర్‌లో 365 రోజులు నీళ్ల ఉండే విధంగా కుమురం భీం రిజర్వాయర్ నుండి ఈ మినీ రిజర్వాయర్‌కు నీటి సదుపాయం కల్పించిందన్నారు. ప్రభుత్వం కానీ గత వర్షాలకు తెగిపోవడంతో మరమ్మతులు చేయకపోవడం వలన రైతులు అనేక రకంగా నష్టపోతున్నారని తెలిపారు. కావున బురదగూడ రిజర్వాయర్‌కు మరమత్తులు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొట్రంగి నాందేవ్, చటరే పోశెట్టి, పాండు, కిషన్, మోర్లే, కోటంగరి సత్యనారాయణ, ముంజం రమేష్, డోకే నానాజీ, డోకే భీంరావు, సంపత్ కుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

శ్రమదానంలో గ్రామస్తులు ముందుకురావాలి

- డీఆర్‌డీఓ బానోత్ దత్తారాం

నవతెలంగాణ-జైనూర్



మొక్కలు నాటి నీరుపోస్తున్న డీఆర్‌డీఓ, గ్రామస్తులు

జన్ బాగీ దారి కప్‌లో భాగంగా చేపట్టే శ్రమదానం కార్యక్రమంలో గ్రామస్తులు ముందుకు రావాలని డీఆర్‌డీఓ బానోత్ దత్తరాం అన్నారు. సోమవారం లింగపూర్ మండలంలోని జాముల్‌దర గ్రామంలో ప్రధాన మంత్రి కృషి సంచాయి యెజన 2.ఓ, వాటర్డ్ యాత్రతో పాటు జన్ బాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమదానం కార్యక్రమంలో ఐదు వందల మంది గ్రామస్థలు స్వచ్ఛందనం చేయడం అభినందనీయమన్నారు. ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. టివి షో ద్వారా వాటర్ షెడ్ యాత్ర గురించి అవగాహన కల్పించారు. నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతలు, ఊట మెంటలు, చెక్‌డ్యాం, పారంపాడ్లు ద్వారా నీరు పోదుపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుల భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం అధికారులను శాలువాలతో సత్కరించారు. ఇందులో వాటర్‌షెడ్ ప్రాజెక్టులో పని చేసిన వారికి, స్థానిక ప్రముఖులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో పీఎంఈఎస్‌వై అధికారి కే.అంజనేయులు, ఎంపీడీఓ రాంచదర్, టీఏ, ఏపీఓ పాల్గొన్నారు.

తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి



భీం విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేస్తున్న తుడుం దెబ్బ నాయకులు

నవతెలంగాణ-కెరమెరి

ఈనెల 12నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ కోటినాక విజయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పోరుగడ్డ జోడేగాట్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భీమ్ నిలవెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా వసతి సౌకర్యాలు చేయాలన్నారు. అనంతరం కుమురం భీం విగ్రహం వద్ద గ్రామ పటేల్ దేవారిలతో తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభల కరపత్రాలను విడుదల చేసి ఆదివాసీ హక్కులు, చట్టాలను కాపాడేందుకు తుడుం దెబ్బ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేయడానికి ఈ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తుడుం దెబ్బ కమిటీలు హాజరై రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కనుక రమేష్, కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు కోవా విజయ్ కుమార్, తుకారం, దుందే రావు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల సరఫరాను అరికట్టాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీసీ యువజన సంఘం నాయకులు

నిషేదిత, నకిలీ పత్తి విత్తనాల సరఫరాను ఆరికటి, సరఫరా చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్‌కుమార్ కోరారు. సోమవారం కలెక్టర్ వెంకటేష్‌ధోత్రేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, గడ్డి మందులపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నిషేధంలో ఉన్న బీజీ-3(గ్లైసిల్) నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకొని రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్రధాన పంటగా దాదాపు 3.50 లక్షల ఎకరాల్లో ప్రత్తిని సాగుచేస్తున్నారని తెలిపారు. కొందరు అక్రమార్కులు అడ్డదారిలో డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుండి నిషేధిత బీజీ-3 నకిలీ ప్రత్తి విత్తనాలు, గడ్డి మందులను దిగుబడి చేసుకొని అమాయక రైతులకు అంటకడుతున్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రత్తి విత్తనాలు సాగుతో పాటు గడ్డి మందులు వినియోగంతో భూసారం తగ్గి క్యాన్సర్ కారకాలు భూమిలో పెరుగుతాయని అనేక పరిశోధనలో తేలిందన్నారు. దీంతో నిపుణుల సూచన మేరకు ఈ నకిలీ పత్తి విత్తనాలు గడ్డి మందులపై ప్రభుత్వం నిషేధం విధించిందని గుర్తుచేశారు. ఈ విత్తనాల సాగుతో తాత్కాలికంగా వ్యయం తగ్గినా దీర్ఘకాలికంగా కలిగే నష్టాలే ఎక్కువని, రైతులకు అవగాహన లేకపోవడంతో వ్యాపారులు చెప్పింది విని ఎక్కువగా మోసపోతున్నారని వివరించారు. పోలీస్ యంత్రాంగం ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీలు పకడ్బందీగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసి ఆరికట్టే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో యువ నాయకులు బొట్టుపల్లి సాయికృష్ణ, పిప్పిరి సమ్మన్న, టోబ్రే శ్రీకాంత్ నరేష్ ఉన్నారు.

పశువుల అక్రమ రవాణాదారులపై కేసు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పశువులను ఆక్రమంగా తరలిస్తున్న 13 మందిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ టౌన్ సిఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సిర్పూరు మార్కెట్ నుండి హైద్రాబాద్‌కు 13 బొలెరో వాహనాలలో సరైన పత్రాలు లేకుండా 26 ఎద్దులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ వివరించారు. పట్టుకున్న ఎద్దులను త్రిశూల్‌పహాడ్‌పై ఉన్న గోశాలకు తరలించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూరుకు చెందిన ఎండి సిరాజ్, మహ్మద్ రియాజ్, ఎండి సాజిద్, రామడామినిపెల్లికి చెందిన గుంటకుల మహేందర్, చింతకొండి స్వామి, మటేటి మహేందర్, మటేటి రాము, దమ్మన్నపేటకు చెందిన ఉప్పడ నరసయ్య, కోశ్నపల్లికి చెందిన గుంటకుల రమేష్, పెద్దపల్లి జిల్లా జూకపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన పైదిపాల రవి, ధర్మారం మండలం నందిమేడారంకు చెందిన ఆవునూరి తిరుపతి, బంజారపల్లికి చెందిన నూనవత్ సంతోష్, ఎస్లావత్ జితేందర్‌లపై పశువులను క్రూరత్వంగా హింసించిన చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇక నుండి పశువులను రవాణా చేసే ముందు వెటర్నరీ డాక్టర్ నుండి తీసుకున్న మెడికల్ సర్టిఫికెట్‌తో పాటు తాగునీరు, గడ్డి వంటి మౌళిక సదుపాయాలు కలిగి ఉండాలని సీఐ సూచించారు.

రజతోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 27న బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని, గ్రామగ్రామన ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్‌తో కలిసి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 27న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభ నేపథ్యంలో పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. పార్టీ రజతోత్సవ వేడుకలు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేసే బాధ్యత ప్రతి ఒక్క నాయకునిపై ఉందన్నారు. పదేండ్ల పాలనపై ప్రజలకు వివరిస్తు కాంగ్రెస్ వైఫల్యాలను తెలియజేయాలన్నారు. హామీలను ఏ విధంగా విస్మరించిందో ప్రజలకు తెలియజేస్తు సభకు జనసమీకరణ చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో సభ గురించి చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులతో చేపట్టిన పలు సీసీ రోడ్లను సోమవారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు. మండలంలోని బురదగూడ పంచాయతీ పరిధిలోని చారిగాంలో రూ. 10 లక్షలు, కోసిని పంచాయతీ పరిధిలోని డాడానగర్‌లో రూ. 10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా ఎన్టీఓస్ కాలనీ పంచాయతీ కేంద్రంలో రూ. 10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం వల్ల గ్రామాలలో సిమెంట్ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం త్వరితగతిన పూర్తవుతున్నట్లు తెలిపారు. రూ. 10 కోట్ల అంచనాతో నియోజకవర్గంలో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణకు ప్రజలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, డాక్టర్ సత్యం, ఆరోగ్య విద్య అధికారులు రషీద్, లలిత పాల్గొన్నారు.

కొండగట్టుకు బయలుదేరిన ఆంజనేయ భక్తులు

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని సావర్‌ఖేడ్ గ్రామానికి చెందిన యువకులు ఆంజనేయ స్వామి దీక్ష చేపట్టారు. ఈనెల 12న కొండగట్టులో దీక్ష విరమణ కార్యక్రమం నేపథ్యంలో సావర్‌ఖేడ్ గ్రామానికి చెందిన 11 మంది యువకులు సోమవారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | ఏప్రిల్ 08, 2025 | www.navatelangana.com

లక్షెట్టిపేట ఎస్ఐగా సురేష్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెట్టిపేట ఎస్ఐగా గోపతి సురేష్ సోమవారం ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసి ఎస్ఐ సతీష్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీకావడంతో ఆయన స్థానంలో హాజీపూర్ ఎస్ఐగా విధులు నిర్వర్తించిన గోపతి సురేష్ బదిలీపై లక్షెట్టిపేటకు వచ్చారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం వినతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



ఇటీవల ఒమన్ దేశంలోని జాలన్ ప్రాంతంలో మండలంలోని హనుమంతపల్లికి చెందిన గల్ఫ్ కార్మికుడు గుమ్ముల కొమురయ్య మరణించిన విషయం తెలిసిందే. ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి జన్నారం మండల అధ్యక్షుడు మగ్గిడి తిరుపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలాజీ శ్రీనివాస్ సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 216 నెంబర్‌ను అనుసరించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం ఇవ్వాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

● బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా, అభివృద్ధి పథకాల గురించి నవతెలంగాణతో మాట్లాడారు. బెల్లంపల్లి పట్టణ ప్రజలకు గోదావరి తాగునీరు అందించేందుకు అమృత పథకం ద్వారా రూ.62 కోట్లు మంజూ రయ్యాయని పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. సెప్టెంబర్ నాటికి పనులు పూర్తవుతాయన్నారు. ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లికి సరఫరా చేసే మంచినీటి పైప్ లైన్ ఏడు కిలోమీటర్ల మేరకు పూర్తయిందని, 18 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మించాల్సి ఉందన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు భీమ్ లెవెల్ నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. అమృత్ మంచినీటి పథకంలో భాగంగా పట్టణంలో నాలుగు కిలోమీటర్ల పైప్ లైన్ నిర్మించాల్సి ఉందన్నారు. టెండర్ గడుపు 2026 జూన్ కాగా గడువు కంటే ముందే గోదావరి నీరు సరఫరా చేయనున్నట్లు వివరించారు. మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 11,601 నివాస గృహాలు ఉండగా 4,500 మున్సిపల్ నల్లాలు, మరో 5 వేలు మిషన్ భగీరథ నల్లాలున్నాయని తెలిపారు. 328 చేతిపంపులు నల్లల ద్వారా పట్టణ ప్రజలకు నీటి సరఫరా జరుగుతుందని వివరించారు. పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ పథకం ద్వారా రూ.19 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పట్టణంలో నాలుగు కిలోమీటర్ల బీటి రోడ్డు నిర్మాణానికి గాను రూ.8.7 కోట్ల నిధులను కేటాయించినట్లు పేర్కొన్నారు. 1.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. మురికి కాలువల నిర్మాణానికి రూ.8 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జంక్షన్ ఇంప్రూమెంట్ నిర్మాణ పనుల కోసం రూ.కోటి నిధులను వెచ్చించినట్లు తెలిపారు.

మనువాద భావాజాలానికి వ్యతిరేకంగా పోరాడుదాం

● పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు సికిందర్



నవతెలంగాణ-జైపూర్

విద్యారంగంలో మనుభావాజాలానికి వ్యతిరేకండా పోరాడుదామని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఉస్మానియా క్రాంతిధార కామ్రేడ్ జార్జ్‌రెడ్డి 53వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ఉస్మానియా యునివర్సిటీలో మతోన్మాదానికి మహిళలపై లైంగిక దాడులకు వ్యతిరేకంగా పిడికిలి బిగించి పోరాడిన విప్లవ విద్యార్థి నాయకుడైన కామ్రేడ్ జార్జ్‌రెడ్డి క్యాంపస్‌లో జరుగుతున్న అన్యాయాలను లంపెన్ గుండాల దాడులను ఎదిరించిన వ్యక్తిగా గుర్తి చేశారు. సమసమాజ స్థాపనకు ఉద్యమిస్తున్న జార్జ్‌రెడ్డి ఎదుగుదలని జీర్ణించుకోలేని మతోన్మాద గుండాల హత్య చేశారని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకై పోరాడాలని, అమరత్వాన్ని స్మరించుకుంటూ జరుగుతున్న వర్ధంతి సభలను జయప్రదం చేయాలని ఆయన విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రమ్య, అఖిల, కావ్య, మహేశ్వరి, ప్రసన్న, స్వప్న పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది



నవతెలంగాణ-నస్పూర్

అన్ని దానముల కన్నా రక్తదానం గొప్పదని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్ బాబు ఏర్పాటు చేసిన రక్త దాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించి, డిస్పెన్సరీలో ఫిజియోథెరపీ విభాగంలో నూతన పార్లర్ బార్, ఫిజియో స్టెయిర్ కేస్ ల్యాడర్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే రక్తదానానికి ముందుకు వచ్చిన వృత్తి శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న యువకులను, వివిధ గనుల నుంచి రక్తదానం చేయడానికి విచ్చేసిన 44 మంది ఉద్యోగులను ఈ సందర్భంగా అభినందించి వారికీ ప్రశంసాపత్రాలను అందజేశారు. 56వ సారి రక్తదానం చేసిన వృత్తి శిక్షణ కేంద్రం శిక్షకులు రాజ్‌కుమార్‌ను జీఎం అభినందించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇలా సేకరించిన రక్తాన్ని తలసేమియా వ్యాధిగ్రస్థులకు, కిడ్నీ వ్యాధిగ్రస్థులకు, కాన్సర్ వ్యాధిగ్రస్థులకు, గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రిలోని నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. కంపెనీ ఉత్పత్తితో పాటు సామాజిక సేవలో కూడా ముందుంటుందని అన్నారు. అలాగే రెడ్ క్రాస్ సొసైటీ వారు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా వర్క్ షాప్ డీజీఎం రవీందర్, వృత్తి శిక్షణ కేంద్రం ఎస్ఓఎం కల్లూరి వెంకట రామారావు, డీవై పీఎం రాజేష్, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, డాక్టర్ లోకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

● రజతోత్సవ వేడుకలకు సిద్ధం కావాలి
● చెన్నూర్ నుండే మళ్లీ పోటీ చేస్తా
● బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బాల్క సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

నవతెలంగాణ-మంచిర్యాల

ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని, తెలంగాణ నుంచి గెలిచిన ఎనిమిది మంది ఎంపీలు మన రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు తేవడంలో విఫలమయ్యారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమెల్యే బాల్క సుమన్ విమర్శించారు. ప్రజా క్షేత్రంలో బీజేపీ, కాంగ్రెస్ చేసిన మోసాలను ఎండగట్టే సమయం వచ్చిందని, ఈ నెల 27న వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహకించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమెల్యే నివాసంలో దివాకర్ రావుతో కలిసి మంచిర్యాల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు లేక తెలంగాణ ఎడారిల మారుతున్న సమయంలో కేసీఆర్ తెలంగాణ కోసం సమర శంకం పూరించడని, 14 సంవత్సరాల సుధీర్గ పోరాటం తరువత తెలంగాణ ఏర్పడిందని, అభివృద్ధి పథంలో దూసుకు పోతున్న తెలంగాణలో మళ్లి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లి మొదటికి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే పల్లెలో కరెంట్ కష్టాలు, కాల్పుల మోతలు మొదలయ్యాయని, సాగు నీరు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ భూములను లాక్కునే క్రమంలో ఎంతోమంది అమాయక ప్రజలు, విద్యార్థులపై లాటి ఛార్జ్ చేసి అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. తెలంగాణను సంక్షోభంలోకి కాంగ్రెస్ నాయకులూ నెట్టేశారని పేర్కొన్నారు. బీజేపీ నుండి గెలిచినా 8 మంది ఎంపీలు తెలంగాణకు నిధులు తేవడంలో విఫలమయ్యారని, అధికారంలోకి రావడం తోనే లక్ష ఉద్యోగాలు కల్పిస్తామన్న మోడీ తెలంగాణలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాడో బీజేపీ నాయకులు తెలపాలని ప్రశ్నించారు. కార్యకర్తలు నాయకులు ఓపికతో ఉండాలని, ధైర్యాన్ని కోల్పోవద్దని మళ్లి చెన్నూర్ నుండే ఎమెల్యేగా పోటి చేస్తానని ప్రజలు కోరుకుంటున్న తెలంగాణ మళ్లీ అధికారం లోకి వస్తదని హామీ ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వినియోగించుకొని కాంగ్రెస్ నాయకులూ, ఎమెల్యేలు పని చేయాలని కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. మాజీ ఎమెల్యే నడిపెల్లిదివాకర్‌రావు, నాయకులు విజిత్ రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, లక్షెట్టిపేట్ మాజీ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, పోడేటి శ్రీనివాస్, గాదే సత్యం పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

● హెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య



విలేకరులతో మాట్లాడుతున్న తిప్పారపు సారయ్య

నవతెలంగాణ-జైపూర్

మే 20న చేపట్టనున్న దేశ వ్యాప్త ఒక్క రోజు సమ్మెను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య పిలుపునిచ్చారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను 4 కోడలుగా కేంద్ర ప్రభుత్వం కుదించిందని, ట్రేడ్ యూనియన్ వ్యవస్థను లేకుండా చేయాలని చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. గత మార్చి 18న ఢిల్లీలో హెచ్ఎంఎస్ యూనియన్‌తో సహా అన్ని జాతీయ కార్మిక సంఘాలు, అసంఘటిత కార్మిక సంఘాలు ఉమ్మడిగా దేశవ్యాప్తంగా అన్ని పరిశ్రమలలో సమ్మె చేయుటకు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణిలో కూడా కార్మికులంతా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమ్మెలో పాల్గొనాలని కార్మిక సంఘాల తరపున విజ్ఞప్తి చేయడం జరుగుతుందని తెలిపారు. సింగరేణిలో సమ్మె విజయవంతం చేయడానికి అన్ని కార్మిక సంఘాలు కలిసికట్టుగా పని చేయాలని విజ్ఞప్తి చేసిన ఆయన సమ్మె విజయవంతం కావడానికి విడివిడిగా ప్రచారం చేయడం సరికాదని తెలిపారు. అవసరమైతే నిరవధిక సమ్మె చేసైనా కార్మిక చట్టాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపిన ఆయన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్మిక వ్యతిరేక చట్టాలను ప్రవేశపెట్టడం మానుకోవాలని కార్మిక సంఘాల తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు కంబాల నర్సయ్య, ఏరియా నాయకులు దుర్గం లక్ష్మన్, కొల్లూరి శ్రీనివాస్, కొట్టె సురేష్, నామాల శ్రీనివాస్, మహేష్, వేముల వంశీ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

● డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. సోమవారం మండలంలో పాత కొమ్ముగూడెం, కొత్త కొమ్ముగూడెం గ్రామాల్లో 5వ రోజు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో ఆమె పాల్గొన్నారు. ముందుగా జాతీయ జెండాను ఎగురవేసి, మహాత్మా గాంధీ, డా.బీఆర్ అంబేద్కర్, రాజ్యాంగ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు సురేఖ మాట్లాడుతు భారతదేశ రాజ్యాంగం అమలుకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబెద్కర్ గారిని పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. గ్రామ మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని కోరారు. ఈ పాదయాత్రలో జిల్లా ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రరావు, మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్, మండల నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

అలరించిన కళాశాల వీడ్కోలు పార్టీ



వేదికపై నృత్యాలు చేస్తున్న కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-మందమర్రి

వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కళాశాల వీడ్కోలు పార్టీ సోమవారం సాయిమిత్ర గార్డెన్‌లో నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలతో హుషారెత్తించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఉదారి చంద్రమోహన్ మాట్లాడుతూ కోల్ బెల్ట్, పారిశ్రామిక ప్రాంతమైన జిల్లాలో వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నాణ్యమైన విద్యతోపాటు ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాన్ని అత్యున్నతమైన అధ్యాపకులచే బోధించడం జరుగుతుందని తెలిపారు. పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. నిరంతర కృషి క్రమశిక్షణతోనే విజయాలు సాధించవచ్చునని, ఓర్పు అంకితభావంతో కష్టపడి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని విద్యార్థులకి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో హుషారెత్తించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు సతీష్, రాజేష్, శారీన, శ్రీలేఖ, సమీర్, చైతన్య రాజేష్, వంశీ, చిరంజీవి, పవిత్ర, నేహా, కీర్తన, తాజ్ బాబా పాల్గొన్నారు.



పోటాపోటీగా నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి మండలంలోని భూదాకలన్ శివారులో రెవెన్యూ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అక్రమణ దారులు సర్వే నెంబర్ 170 ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి తహసీల్దార్ జ్యోత్స్న తెలిపారు.

మహిళలల రక్షణకే షీ టీమ్ పనిచేస్తోంది : ఎస్ఐ హైమ



నవతెలంగాణ-నస్పూర్

మహిళలకు ఏదైన సమస్య తలెత్తిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీ టీమ్ వారి రక్షణ కోసమే పని చేస్తోందని ఎస్ఐ హైమ అన్నారు. సోమవారం సృష్టి ఇన్‌స్టిట్యూట్ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని షీ టీమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ మాట్లాడుతూ ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడం షీ టీమ్ కర్తవ్యం అని అన్నారు. ప్రతి ఒక్కరు వారి పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలపాలని, వచ్చిన ఫిర్యాదుపై తక్షణమే షీ టీమ్ పోలీసులు స్పందించి సంబంధిత విభాగాలకు సమాచారం అందజేయడం ద్వారా ఫిర్యాదు చేసిన మహిళకు సహాయం చేస్తాయని తెలిపారు. ఫిర్యాదు చేయాలనుకుంటే 6303923700 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. అలాగే అత్యవసర సమయంలో డయల్ 100కి ఫిర్యాదు చేయాలన్నారు, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అనంతరం వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్లు అంబాల రాజ్ కుమార్, భాస్కర్,శంకర్, షీ టీం సభ్యులు జ్యోతి, శ్రీలత పాల్గొన్నారు.

కానూరు వెంకటేశ్వరరావు ఆశయాలకు పోరాడుదాం



నవతెలంగాణ-మంచిర్యాల

అరుణోదయ వ్యవస్థాపకులు కామ్రేడ్ కానూరు వెంకటేశ్వర్‌రావు ఆశయ సాధనకు పోరాడుదామని అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంతెన మల్లన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో అరుణోదయ వ్యవస్థాపకులు విప్లవ సంస్కృతిక యోధుడు కామ్రేడ్ కానూరు వెంకటేశ్వరరావు 10 వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరుణోదయకు ఆది గురువు, ఆటపాటలకు కల్పతరువు, సమరంలో అమరత్వం చెందిన మృతవీరుల త్యాగాల గానానికి ప్రాణం పోసి సేవలు అందించాడని కొనియాడారు. కల కోసం కాదు కల ప్రజల కోసం అని నినదించిన కానూరు లాంటి అమర కళాకారులు అందించిన స్ఫూర్తితో కళాకారుల సంఘటితంగా తమ కళారూపాలను బదులు పెట్టి తిరోగమన వాదాన్ని తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతి సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి ముష్క జ్యోతి, దారిశెట్టి అరుణ, శేఖర్, శ్రీనివాస్, లాల్ కుమార్, శ్రీకాంత్, తిరుపతి, అనిత, సురేందర్ పాల్గొన్నారు.

కరాటే శిక్షణతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

● జనరల్ మేనేజర్ కొండారెడ్డి శ్రీనివాసులు



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ టౌన్‌షిప్ కేంద్రంగా కొనసాగుతున్న కరాటే శిక్షణా కేంద్రం ద్వారా శిక్షణ పొందిన వారికి బెల్ట్ గ్రేడింగ్ ద్వారా అభ్యాసకులకు బెల్టులు ప్రధానం చేశారు. ఎస్టీపీపీ ఓపన్ ఆడిటోరియంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ నిర్వహించగా ప్రతిభ కనబర్చిన వారికి ప్లాంట్ జనరల్ మేనేజర్ కొండారెడ్డి శ్రీనివాసులు సోమవారం బెల్టులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ కరాటే శిక్షణ పొందిన వారిలో శారీరక ధృడత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు. ప్లాంట్ డీజీఎం దరావత్ పంతులా నాయక్ ఆలోచనకు ఎస్టీపీపీ డైరెక్టర్ అండ్ జీఎం ఆమోదంతో 2021 సంవత్సరంలో కరాటే శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సింగరేణి ఎస్టీపీపీ, పవర్‌మేక్, సీఆర్‌పీఎఫ్ ఉద్యోగుల పిల్లలు కరాటే శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రాజేష్, జెంట్సోరియా స్టైల్ చీఫ్ కోచ్ రాజనర్స్, జూల శ్రీనివాస్, ఎస్టీపీపీ కరాటే కేంద్రం కోచ్ శివ మహేష్ పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలపై అవగాహన

నస్పూర్ : వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శ్రీరాంపూర్ ఏరియా వైద్య ఆరోగ్య విభాగం ఏరియా హెల్త్ ఆఫీసర్ లోకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్కే-6 గనిపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ, జాగ్రత్తలు పాటిస్తూ దీనికి సంబంధించి వ్యక్తిగత పరిశుభ్రత అత్యవసరమని తెలిపారు. తీవ్రమైన ఎండ ప్రభావం పిల్లల మీద, పెద్ద వయస్సు వారిపైన, ఎండలో కష్టపడి పనిచేసేవారి మీద ఉంటుందన్నారు. ఎందుకంటే అధిక వేడిమి వల్ల శరీరంలో మార్పులు వస్తాయన్నారు. ఈ మార్పు కొంత అనారోగ్యాన్ని కలుగజేస్తుందని, తీవ్రమైన ఎండలో పని చేసేవారు వడదెబ్బకు గురావుతారని పేర్కొన్నారు. అనంతరం గని మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ డాక్టర్ సలహాలు సూచనలు పాటించాలని, మద్యపానం, ధూమపానం, మాంసాహారం అతిగా తీసుకోకుండా కూరగాయలకు, పండ్లకు ప్రాముఖ్యత ఇస్తూ ఆరోగ్యం మనచేతిలో ఉన్నదని తెలుసుకొని జాగ్రత్త పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, ఫిట్ ఇంజనీర్ అండె శ్యాంకుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎస్.సురేందర్, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రటరీ సంగం సదానందం, సాయి బాబా, అడ్డు శ్రీనివాస్, చిలుక రాంచందర్, సంతోష్ కూమార్, బి.క్రాంతి కూమార్ పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)



ఆడబిడ్డ పెళ్లి కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికల్లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ పెళ్లి కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వారి ఆధర్వంలో డా. కొత్తపల్లి శ్రీనివాస్ ప్రతి మంగవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వహకులు కోరారు. పరీక్షలో అవసరమున్న వారిని ఎంపిక చేసి సొసైటీ తరపున రవాణ, భోజనం సదుపాయం కల్పిస్తారు. మంగళవారం 14 మందికి ఆపరేషన్ కోసం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా డా.కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా వేల మందికి ఆపరేషన్ చేయించామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి సిబ్బంది గోపి ఉన్నారు.

పని కల్పిస్తారా లేదా...?

- కలెక్టరేట్ ఎదుట ఉపాధి హామీ కూలీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమకు పని కల్పించాలని మహాత్మా గాంధీ ఉపాధి హామీ కూలీలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గరిగెల పద్మ, పావని మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు కావడంతో మహాత్మా గాంధీ ఉపాధి హామీలో పనిచేసే అవకాశం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి చేస్తే గాని పుటగడవాని తమ కుటుంబాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. అధికారులు స్పందించి పని కల్పించాలని కోరారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కూలీలకు చెందిన జాబ్ కార్డులను రాజంపేట గ్రామపంచాయతీలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయకపోతే పోరాటలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు స్వరూప, కోశాధికారి మంజుల, సహాయ కార్యదర్శి సుగుణ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా మూల్యాంకనం చేయాలి

- ఆర్జేడీ కే.సత్యనారాయణరెడ్డి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్‌లో జరుగుతున్న పదో తరగతి మూల్యాంకన కేంద్రాన్ని వరంగల్ ఆర్జేడి కే.సత్యనారాయణరెడ్డి, డీఈఓ రామారావుతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఆర్జేడీ మాట్లాడారు. ఎలాంటి తప్పులు లేకుండా మూల్యాంకనం చేయాలని అన్నారు. సమాధాన పత్రాలలో ఎలాంటి తప్పులు లేకుండా దిద్దాలని, మూల్యాంకన కేంద్రంలోనికి ఎట్టి పరిస్థితిలోనూ మొబైల్ ఫోన్ అనుమతించ బడవని తెలిపారు. గోప్యత పాటించాలని సూచించారు. ఇంకా డ్యూటీలో రిపోర్ట్ చేయనివారు ఉంటే మంగళవారం ఉదయం లోపు సెయింట్ థామస్ హైస్కూల్లోని స్పాట్ సెంటర్‌లో రిపోర్ట్ చేయాలని, లేనిచో సీసీఏ రూల్స్ ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్యాంప్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు ముడారపు పరమేశ్వర్, వైవి రమణారెడ్డి, సీఈలు, ఏఈలు, స్పెషల్ అసిస్టెంట్లు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అధ్యయన కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో 2055 -26 విద్యా సంవత్సరంలో లక్ష అభ్యాసకులను అడ్మిషన్‌లో భాగంగా సెంటర్ ఆఫ్ ఇన్నోవేషన్ ప్రతినిధి బృందం సోమవారం జిల్లా కేంద్రంలోని ఆధ్యయన కేంద్రాన్ని తనిఖీ చేసింది. జిల్లాలోని ఓపెన్ స్కూల్, అధ్యయన కేంశాలను సందర్శించి అభ్యాసకులు, తల్లిదండ్రులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభిప్రాయాలను బృందం ప్రతినిధులు డా.స్వప్న, భగత్ కాందియడ్ సర్వే ద్వార సేకరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ ఎన్.అశోక్ కుమార్ వివరాలను వివరించినారు. ఆనంతరం ఇన్‌చార్జి డీఈఓ ఉదయ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలోని ఓపెన్ స్కూల్స్ బాగ నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా జిల్లాపరిషత్ సెంకడరీ బాలురు పాఠశాలను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయుల ఎంఈ.సుబాష్, కవిత, సహాయ కో-ఆర్డినేటర్ వద్లూరి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని బస్ స్టాప్ వద్ద మాజీ ఎంపీపీ డుబ్బుల నాన్నయ్య ఆయన తల్లిదండ్రులు డుబ్బుల పోచయ్య, బయ్యక జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఎస్సై ఇస్లావత్ నరేష్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మారుతి, బింకారి నారాయణ, ఆరెకుల సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్, మహేష్, మస్తాన్, పురుషోత్తం చారి పాల్గొన్నారు.

విద్యార్థులకు షీ టీంపై అవగాహన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆసిఫాబాద్ సబ్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యురాలు స్వప్న మాట్లాడుతూ మహిళలు పిల్లలను రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందిస్తున్నామని ఏదైనా సమస్య ఉంటే డయల్ 100కు కాల్ చేయాలని, స్థానిక పోలీస్ అధికారులకు తెలియజేయాలని, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, లైంగికంగా వేధించటం, వెంటపడటం లాంటివి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలను ఎవరైనా వేధిస్తే ఆసిఫాబాద్ షీటీం నంబర్ 8712670564కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ, సిబ్బంది లింగమూర్తి, షిటీమ్ సిబ్బంది శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-బెజ్జూర్

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని కుకుట, తలాయి తదితర గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణపై పాదయాత్ర నిర్వహించారు. తలాయి, తిక్కపెల్లి, పాపనపేట, గబ్బాయి, హెట్టిగూడ గ్రామాలలో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగ పరిరక్షణ కాపాడెందుకు గ్రామాల్లోని ప్రజలను చైతన్యపరిచామని శ్రీవర్ధన్ తెలిపారు. దీనిలో భాగంగా ప్రతిగ్రామంలోని ప్రజలను బెజ్జూర్ మండల కాంగ్రెస్ నాయకులు కలిసి వారితో పాటు గ్రామాలలో పాదయాత్ర చేస్తూ రాజ్యాంగ పరిరక్షణ గురించి వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగ్గాగౌడ్, విశ్వేశ్వర్, నాహిరల్లీ, రషీద్, పెంటయ్య పాల్గొన్నారు.

పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని మాలీ సంఘం నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. 2001 నుండి జ్యోతిబాపూలే జయంతి, వర్ధతలను తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సామజిక ఉద్యమ పితామహుడైన జ్యోతి బాపూలే జయంతి, వర్ధంతులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన సేవలకు గాను జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని కోరారు. నిర్వాహణకు ప్రతి సంవత్సరం రూ.లక్ష కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్నూలే మెంగాజి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగోసే శంకర్, రైతు సంఘం అధ్యక్షుడు మారుతి, జిల్లా గౌరవ అధ్యక్షుడు దత్తు, యువజన సంఘం ఉపాధ్యక్షుడు సాగర్, నాయకులు శ్రీకాంత్, మహేందర్, శ్రీహరి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాలీ సంఘం నాయకులు

బీఎస్ఎన్ఎల్ నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి



సేవా శిబిరంలో వినతతులు స్వీకరిస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించేందుకు కృషి చేస్తోందని డీఈ శివనాగేశ్వర్ అన్నారు. సోమవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కస్టమర్ సర్వీస్ మంత్‌లో భాగంగా సేవా శిబిరాన్ని నిర్వహించారు. వినియోగదారులు వారి సమస్యలను అధికారులకు విన్నవించారు. కొన్నింటిని అక్కడిక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా డీఈ శివనాగేశ్వర్‌రావు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరింత చేరువచ్చేలా కార్పొరేట్ కంపెనీలు ప్రకటించిన విధంగా కస్టమర్ సర్వీస్ మంత్‌లో భాగంగా శిబిరాలను నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుంటున్నామని తెలిపారు. సిమ్, నెట్వర్క్, టెలిఫోన్ బిల్లులు, ఎంఎన్ఎస్ వాటిపై 25 ఫిర్యాదులు రాగా, 20 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. మరో ఐదు ఫిర్యాదులను రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా ఈనెల 22న మరోసారి శిబిరాన్ని నిర్వహిస్తామని సమస్యలను నేరుగా వచ్చి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం రంజిత్, ఎస్ఈఈలు, జేటీఓలు పాల్గొన్నారు.

మహనీయులతోనే దేశం సుభిక్షం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మహనీయులతోనే దేశం సుభిక్షం ఉంటుందని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి అన్నారు. సోమవారం సోన్ మండలం లోకల్ వెల్మల్, గాంధీనగర్ గ్రామాల్లో జరిగిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డా.బీఆర్ అంబేద్కర్ వంటి మహాత్ముల చూపిన మార్గం నడిస్తే, భారత దేశంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సోన్ మండల మహిళా అధ్యక్షురాలు రేఖ, కాంగ్రెస్ నిర్మల్ మహిళా పట్టణాధ్యక్షురాలు వాసవి, కాంగ్రెస్ సోన్ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, ప్రసాద్ కుమార్, రమేష్‌రెడ్డి, ప్రేమ్, గడ్డం నర్సారెడ్డి, ప్రవీణ్, శేఖర్, రమేష్‌రెడ్డి, దాసు లింగన్న, స్వామి, లక్ష్మణ్, విశ్వనాథ్, నిషాంత్, నర్సరెడ్డి, ఎల్లయ్య, రాజయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



విగ్రహాల ఎదుట నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సఖి కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ లో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం సిబ్బంది లావణ్య, సైకో సోషియల్ కౌన్సిలర్ సఖి కేంద్రం డియర్ అందించే ఐదు రకాల సేవలు గురించి వివరించారు. అలాగే గృహ హింస చట్టం, బాల్య వివాహల నిరోధక చట్టం, పోక్సో చట్టం, టోల్ ఫ్రీ నెంబర్లు 181, 100, గురించి అవగాహన కల్పించారు. పని చేసే చోట లైంగిక వేధింపుల గురించి వివరించారు. కార్యక్రమంలో సఖి సిబ్బంది ప్రవీణ, కేస్ వర్కర్, యూత్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది, వృత్తి నైపుణ్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ యువజన సంఘం సమావేశం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పట్టణంలోని టీఎన్జీఓ సంఘ భవనంలో మంగళవారం ఉదయం11 గంటలకు అంబేద్కర్ యువజన సంఘం సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, జిల్లా అధ్యక్షులు బత్తుల రంజిత్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రయాణికులు మరిచిపోయిన వస్తువులను వారికి అందించడంలో నిజాయితీ చాటుకుంటూ వారితో సఖ్యతగా ప్రవర్తించడం వలన అధికారుల నుంచి ప్రజల నుంచి నిర్మల్ ఆర్టీసీ డిపో సిబ్బంది ప్రశంసలు పొందుతున్నారు. సోమవారం ఉదయం నిర్మల్ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు నిర్మల్ నుంచి బైంసా వెళ్తున్న బస్సులో ఎల్.శివకుమార్ అనే ప్రయాణికుడు పర్సు మరచిపోయి, బైంసాలో దిగి వెళ్లిపోయాడు. బస్సు కండక్టర్ సీటు పైనున్న పర్సును గమనించి ఫోన్ నెంబర్ ఆధారంగా ప్రయాణికున్ని పిలిపించి పర్స్ అందచేశారు. పర్సులో రూ.1200 ఆధార్ కార్డ్, పాన్ కార్డు, ఏటీఎం కార్డులు ఉన్నాయి. బస్ కండక్టర్ ఆర్.గంగాధర్ కంట్రోలర్ పి.ఆర్.గోపాల్ సమక్షంలో ప్రయాణికుడికి పర్స్ అందచేశారు. నిజాయితీ చాటుకున్న బస్ కండక్టర్ ఆర్.గంగాధర్ ను డిపోమేనేజర్ కే.పండరి పలువురు అభినందించారు.

డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా డా. కిరణ్



డైట్ ప్రిన్సిపల్‌ను సన్మానిస్తున్న ఏబీవీపీ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా డాక్టర్. కోలా కిరణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఏబీవీపీ శాఖ నాయకులు ప్రిన్సిపాల్‌ను ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణాధ్యక్షులు డాక్టర్. రవికుమార్, జిల్లా కన్వీనర్ ఖడ్సే అక్షయ్, జిల్లా కోకన్వీనర్ నిఖిల్, ఏబీవీపీ నాయకులు కార్తీక్, మహేష్, అజయ్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వే నిధులు విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్, సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్‌లకు నిధులు వారి అకౌంట్‌లో జమ చేయాలని టీజీటీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ జాదవ్ కోరారు. సర్వే చేసి నేటికీ ఆరు నెలలు గడుస్తున్న ప్రభుత్వం నేటికీ నిధులు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. సోమవారం సీపీఓను కలిసి నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు.



గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు



నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ పట్టణంలోని ఐటీడీఏ కార్యాలయం పక్కన మిషన్ భగీరథ వద్ద సోమవారం వాహనాలను ఇన్‌చార్జి ఎస్సై సునీల్ తనిఖీలు చేస్తుండగా, బేల మండలంలోని పాటగూడ, పరస్వాడ గ్రామానికి చెందిన మారుతితో పాటు మరో ఇద్దరితో ఆటోలో గంజాయి తీసుకెళుతున్న క్రమంలో పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు. ఒక్కరు పరారీలో ఉన్నాడు. గంజాయి రెండు కిలోలు, సెల్ ఫోన్, ఆటోనీ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్లకు నిధులు విడుదల చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన పూర్తై సుమారు నాలుగు నెలలపై గడుస్తున్న ఇప్పటివరకు డాటా ఎంట్రీ చేసిన ఆపరేటర్లకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆపరేటర్లు అన్నారు. నిధులు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందించారు. తమ సమస్యను దృష్టిలో ఉంచుకొని డబ్బులు వచ్చే విధంగా చూడాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఈ నెలలోపు వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారని డాటా ఎంట్రీ ఆపరేటర్లు తెలిపారు. కార్యక్రమంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు మాట్ల అనిల్, నెల్లి రవి, గడ్డల ప్రణయ్ కుమార్ పాల్గొన్నారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీఓ



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని మర్తేడి కొత్తగూడెం గ్రామాల్లోని నర్సరీలను సోమవారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. వేసవికాలంలో చెట్లకు నీరు ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధి కూలి ధరను పెంచిందని, దీనిని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు 100 రోజుల పని దినాలను పూర్తి చేయాలన్నారు. పని కావాలని కోరిన ప్రతి కూలికి పని కల్పిస్తామని తెలిపారు.

బదిలీ కానిస్టేబుళ్లకు సన్మానం



నవతెలంగాణ-కెరమెరి

కొన్నేండ్లుగా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లకు సోమవారం స్టేషన్ సిబ్బంది శాలువాతో సన్మానించారు. సివిల్ కానిస్టేబుల్ ప్రేమ్, లక్ష్మీ, జంగు ఆసిఫాబాద్ బదిలీ కాగా హెడ్ కానిస్టేబుల్ భీంరావు ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రావణ్ పాల్గొన్నారు.

విన్నర్స్ ఒలంపియాడ్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా సోమవారం పట్టణంలోని విన్నర్స్ ఒలంపియాడ్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కోసం గ్రాడ్యుయేషన్ దుస్తులు ధరించి వారికి సర్టిఫికెట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు రగల్ జెండా సమావేశం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని హీరాపూర్‌లో ఏప్రిల్ 20న అమర వీరులకు నివాళులర్పించే కార్యక్రమంపై అత్యవసర సమావేశం నిర్వహించబడునని రగల్ జెండా ఆశయ సాధన కమిటీ జిల్లా నాయకులు తొడసం నాగోరావ్ తెలిపారు. దీని కోసం బుధవారం ఇంద్రవెల్లి అమరవీరుల అతిథి గృహం సమావేశం నిర్వహించబడునని, ఈ సమావేశానికి జిల్లా రాయిసెంటర్ సార్మేడిలు, గ్రామ పటేళ్ల, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రగల్ జెండా నాయకులు తులసిరాం, జుగ్నక్ భరత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమయ భారాన్ని తగ్గించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

పాత విధానంలోనే పరీక్షా పత్రాల తరలింపు కొనసాగించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం డీఈవో ఎస్.యాదయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏప్రిల్ 9నుంచి ప్రారంభం కాబోతున్న డిసిఇబి(ఆరు నుండి 9వ తరగతి వరకు) ఎస్ఎ-2 పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను ప్రతి రోజు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నుంచి, మండలాల్లో యుపిఎస్‌ల నుండి తీసుకెళ్లడం ద్వారా సమయ భారం ఏర్పడుతుందన్నారు. అందువల్ల పాత విధానం ప్రకారం ఒకేరోజు తీసుకెళ్లి ప్రధానోపాధ్యాయులు లేదా డిసిఇబి ఆధీనంలో ఉండేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చేపెల్లి బాపు, అసోసియేట్ అధ్యక్షులు సత్తయ్య, ఉపాధ్యక్షులు పద్మ, మన్మోహన్, మహాలక్ష్మి రజిత పాల్గొన్నారు.

కొర్రమీను సాగుకు దరఖాస్తులు

నవతెలంగాణ-నస్పూర్

మత్స్య పరిశ్రమలో పని చేస్తున్న ఔత్సాహికులు, మత్స్యకారులు, మత్స్య రైతులు, హోల్‌సెల్, రిటైల్ చేపల విక్రయదారులు, చేప పిల్లల ఉత్పత్తి చేసేవారిలో ఆసక్తి గల వారి నుండి కొర్రమీను సాగును చేసేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి వై.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాను ముర్రెల్ క్లస్టర్‌గా ఏర్పాటు చేసేందుకు గుర్తించడం జరిగిందని, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా సాధారణ (జనరల్) క్యాటగిరీ-40 శాతం, ఎస్సీ, ఎస్టీ, మహిళ క్యాటగిరీ-60 శాతం రాయితీపై 3 హచరి యూనిట్లు, 10 హెక్టార్లు చేపల పెంపకం చెరువులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులు మత్స్యశాఖ కార్యాలయంలో స్వీకరించడం జరుగుతుందని, వివరాలకు జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-8లో గల జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రిమ్స్‌ను సందర్శించిన ఆత్రం సుగుణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌ను కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలోని పలు వార్డులను నాయకులతో కలిసి పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కుమురంభీమ్ జిల్లా సిర్పూర్(యు) మండలం కోహినూర్(కె) ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీష, ఉపాధ్యాయుడు మెస్రం ఈశ్వర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వారి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ హెల్ప్ డెస్క్‌ను సందర్శించి ఆదివాసీ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వైద్య సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఉద్యోగాల భర్తీకి నేడు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్కామ్), తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాక క్రింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా అర్హత, నైపుణ్యం కలిగిన, సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశాలలో ఉద్యోగాల భర్తీకి 8న జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సిరామిక్ కాస్టర్, జూనియర్ ప్రాసెస్ ఆపరేటర్, ప్రెస్ మెకానిక్, పాలిషింగ్ మెకానిక్, డిజైనర్, ప్రొడక్షన్ సూపర్వైజర్, బాడీ ప్రిపరేషన్ ఇన్చార్జ్, షావెల్ ఆపరేటర్లకు యుఏఈలో ఖాళీలున్నాయని తెలిపారు. అభ్యర్థులు 18-40 మధ్య వయస్సుతో పాటు అర్హతలు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ నవీకరించబడిన రెస్యూమ్‌ను టామ్‌కాం.రెస్యూమ్ఎట్‌దిరేట్‌జిమెయిల్.కామ్‌కు పంపాలని, వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టామ్‌కామ్.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్, 9440049937, 9440049861, 9440051452 నంబర్లలో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మరింత మెరుగైన వైద్య సేవలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా "ఆరోగ్యకరమైన ఆరంభాలు ఆశాజనక భవితవ్యాలు" అనే నినాదంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కార్యక్రమ గోడప్రతులను అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్‌రాజ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, ముఖ్య ప్రణాళిక అధికారి జి. సత్యంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1948 ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాడిందని, ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పునరుత్పత్తి శాతం తగ్గుతుందని, ఈ పరిస్థితి ఆందోళన స్థాయిలో ఉన్నందున మాతా శిశుసంరక్షణ అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకొని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం, ఆరోగ్య కార్యకర్తలకు, వైద్యులకు శిక్షణ అందించడం, అందుబాటులో ఆరోగ్య కేంద్రాలు, నాణ్యమైన ప్రసవ పూర్వ సేవలు, గర్భిణీగా ఉన్నప్పుడు 16-22 వారాల మధ్య టిఫా స్కాన్ చేయడం ద్వారా గర్భస్థ పిండం పెరుగుదల, సమస్యలను ముందుగా గుర్తించవచ్చని, జిల్లాలో అల్ట్రాసౌండ్, రక్త, మూత్ర పరీక్షలు, రక్తపోటు, రక్తంలో చక్కర శాతం, హెచ్‌బి, ఎజి, హెచ్‌ఐవి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ప్రసవం అనంతరం వైద్య సేవలు అందిస్తున్నామని, నవజాత శిశువు సంరక్షణ కోసం పుట్టిన వెంటనే వీలైనంత త్వరగా తల్లి పాలు అందించడంతో పాటు బిడ్డ శరీర ఉష్ణోగ్రత కాపాడటం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రజలందరు ప్రభుత్వ ఆస్పత్రులల్లో ఆశా, ఆరోగ్య కార్యకర్తల ద్వారా వైద్య సేవలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు అనిత, ప్రసాద్, కృపాబాయి, సీతారామరాజు, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : ఆరోగ్యకరమైన ఆరంభాలు - ఆశాజనక భవిష్యత్తు అనే ఒక నినాదంతో ఈ సంవత్సరం ముందుకు రావడం జరిగిందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రజలు ఎదుర్కొంటున్న ఒక ప్రధాన ఆరోగ్య సమస్యతో ముందుకు రావడం జరుగుతుందని, ఈ సంవత్సరం ఆరోగ్యకరమైన ఆరంభాలు - ఆశాజనక భవిష్యత్తులు అనే నినాదంతో ముందుకు రావడం జరిగిందని తెలిపారు. ఆరోగ్య రంగంలో ఎంతో పురోగతి సాధించినా ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మూడు లక్షల మాతృ మరణాలు జరుగుతున్నాయని, అదే విధంగా 20లక్షల నవజాత శిశు మరణాలు జరుగుతున్నాయని తెలిపారు. మాతృత్వ, నవజాత శిశు మరణాలను తగ్గించడానికి అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, ముఖ్యంగా మొదటి మూడు నెలల్లో గర్భవతులను నమోదు చేసిన వారిలో అధిక ప్రమాదంగా లక్షణాలను గుర్తించి చికిత్సలు అందించడం, ప్రసవ సమయంలో, ప్రసవానంతరం సరైన సమయంలో సేవలు అందించడం వల్ల మాతృ మరణాలను, నవజాత శిశు మరణాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సన్నబియ్యం పంపిణీ పథకానికి సంబంధించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10:30 నుంచి 11:00 గంటల వరకు నిర్వహించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నస్పూర్ : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

నేరడిగొండ : మండలంలోని వాంకిడి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వాంకిడి గ్రామాన్ని కాలినడకన సందర్శించిన ఎమ్మెల్యే గ్రామంలో తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సమస్యలు తెలుసుకున్నామని, మొదటి జాబితిలో పేర్లు లేని వారికి రెండో జాబితాలో ఇండ్లు వచ్చే విధంగా చూస్తామని తెలిపారు. ఎవరు ఆందోళన చెందొద్దని, గ్రామ అభివృద్ధి కోసం కోటి రూపాయలు మంజూరు చేస్తానని తెలిపారు. మరికొన్ని రోజుల్లో గ్రామంలో అన్ని సీసీ రోడ్లు పూర్తవుతాయని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, మాజీ సర్పంచ్ రాజు, నేరడిగొండ వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, అనిల్ యాదవ్, పండరీ, గులాబ్, నజీర్, భారత్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ సేన నూనత కమిటి ఏకగ్రీవ ఎన్నిక

జైపూర్ : ఛత్రపతి శివాజీ సేన మండల నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ సేన కమిటీ ఏడాది కాలం పూర్తి చేసుకున్నందున సోమవారం నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షులుగా అట్ల సుమన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గనముక్కుల నరేష్, ప్రధాన కార్యదర్శిగా సార్థపు సంతోష్ ఎన్నికైనట్లు పూర్వ అధ్యక్షుడు మెరిమిడి గణేష్ ప్రకటించారు. 2024 ఫిబ్రవరి 19న శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఇక్కడ ఛత్రపతి శివాజీ సేనా స్థాపించుకున్నట్లు తెలిపారు. కాగా నూతన కమిటి సభ్యులుగా ఎన్నికైన వారికి పూర్వ కమిటీ సభ్యులు అట్ల సుమన్‌రెడ్డి, ఎర్రం మనోహర్‌రెడ్డి స్వాగతం పలికారు. అదేవిధంగా సంవత్సర కాలం పాటు కమిటీ ద్వారా సేవలందించిన పూర్వ కమిటీ సభ్యులకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.